క్లుప్తంగా

సేవలో సంతృప్తి



ఏఎంవోహెచ్ కిషోర్‌ను సత్కరిస్తున్న స్థానికులు, సహోద్యోగులు

కొమ్మాది: విజయవాడ వరదల నేపథ్యంలో అక్కడి ప్రజలకు జీవీఎంసీ సిబ్బందితో పాటు 12 రోజులు సేవలు అందించిన ఏఎంవోహెచ్ డా. కిషోర్‌ను స్థానికులు, సహోద్యోగులు కొనియాడారు. 8వ వార్డు ఎండాడలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ బాధితులు కష్టాల్లో ఉన్నప్పుడు అందించే సేవలు మానసిక ఆనందాన్ని, సంతృప్తిని కలిగిస్తాయన్నారు.

109 మందికి హోమియో వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో 109 మంది రోగులకు వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ సేవలు అందించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.చంద్రశేఖరరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో పూజలు సాగాయి. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, సంకీర్తనలు ఆలపించారు.

పికిల్ బాల్ గ్రౌండ్ ప్రారంభం



గ్రౌండ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది: విదేశాల్లో ప్రాచుర్యం పొందిన పికిల్ బాల్ క్రీడను విశాఖలో ప్రారంభించడం ఆహ్వానించదగిన పరిణామం అని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎండాడలో అత్తిలి స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసిన పికిల్ బాల్ గ్రౌండ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, చెట్టిపిల్లి గోపీ, సాకరి శ్రీనివాసరావు, లొడగల రామ్మోహన్, ఎరుపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

తగరపువలస: ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి భీమిలి అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య శనివారం జరిమానా విధించారు. ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున మొత్తం రూ.2.50 లక్షలు జరిమానా విధించినట్టు ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ప్రయాణం.. నరకప్రాయం



చిన్నయ్యపాలెం వద్ద రహదారి దుస్థితి

- అధ్వానంగా నీళ్లకుండీలు–శిర్లపాలెం రహదారి
- సుమారు 11 కి.మీ పరిధిలో అడుగుకో గొయ్యి
- తరచూ ప్రమాదాలు
- హడలిపోతున్న వాహనచోదకులు



ముకుందపురం వద్ద రహదారిపై గోతులు

తగరపువలస: ఆనందపురం మండలంలోని సింహాచలం–విజయనగరం మార్గంలో ప్రయాణమంటేనే వాహనచోదకులు హడలిపోతున్నారు. నీళ్లకుండీల కూడలి నుంచి శిర్లపాలెం పంచాయతీ వరకు సుమారు 11 కిలోమీటర్ల పరిధి రహదారిపై అడుగడుగునా గోతులు కారణంగా ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరగడంతో, అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆనందపురం మండల నుంచి విజయనగరం టౌన్‌కు చేరుకోవడానికి దగ్గర మార్గం కావడంతో పాటు ఇదే మార్గంలో పక్క జిల్లాలోని అలమండ, కొత్తవలస, జామి, గజపతినగరం తదితర సంతలకు ఎక్కువ మంది రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. నగరానికి చెందిన ప్రయాణికులు తగరపువలస మీదుగా కాకుండా అడవివరం, నీళ్లకుండీల మార్గంలో విజయనగరం చేరుకోవడానికి ఇష్టపడతారు. రద్దీ తక్కువగా ఉండటమే దీనికి కారణం. అయినప్పటికీ ఇటీవల ఈ రహదారిలోని ప్రతి పంచాయతీ పరిధిలో రోడ్డు శిథిలం కావడంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ గోతులు పడిన మార్గంలో వాహనాల ఇరుసులు తరచూ విరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్గం పొడవునా గుంతల కారణంగా సిటీ బస్సులు మాత్రం కాస్త ఆలస్యంగానే నడుస్తున్నాయి.



గిడిజాల కూడలి వద్ద పరిస్థితి



నీళ్లకుండీలు కూడలి వద్ద..



బాకూరుపాలెం శివారులో ..



ముచ్చర్ల కూడలిలో ఛిద్రమైన రహదారి

మూడు మండలాల ప్రజలకూ ఇబ్బందే..

ఆనందపురం మండలంలోని శిర్లపాలెం, బోని పంచాయతీల తరువాత తూర్పు వైపు భీమిలి, ఉత్తర దిక్కున పద్మనాభం మండలాలు ఉన్నాయి. దీంతో మూడు మండలాల ప్రజలు ఈ మార్గంలో ప్రయాణించడానికి మొగ్గు చూపుతారు. పద్మనాభం నుంచి జిల్లా సరిహద్దులో ఉన్న చిన్నాపురం వరకు 8 కిలోమీటర్లు పరిధిలో రహదారి కాస్త ఫరవాలేదనిపించినా నీళ్లకుండీల కూడలి నుంచి శిర్లపాలెం గ్రామాల మధ్య చిన్నయ్యపాలెం, ముకుందపురం, బాకూరుపాలెం, ముచ్చర్ల కూడలి, గిడిజాల కూడలి తదితర చోట్ల రహదారిపై గోతుల కారణంగా తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా ఈ రహదారికి ఇరువైపులా పంచాయతీల ప్రజలు కూడా ఈ శిథిలమైన రహదారిలో ప్రయాణించకపోవడమే మంచిదంటున్నారు. ముఖ్యంగా చీకటిపడితే ఈ మార్గంలో వీధిదీపాలు కూడా ఉండని కారణంగా రహదారిపై గోతులు ప్రాణాంతకంగా మారాయంటున్నారు. ఇటీవల వర్షాలకు గోతులు చెరువుల్లా మారిపోయాయి. అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

గుండెలు గుభేల్‌మంటున్నాయి



నీళ్లకుండీలు–శిర్లపాలెం మార్గంలో ప్రయాణమంటే తోటి కార్మిక డ్రైవర్లు హడలిపోతున్నారు. గోతుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా జరుగుతోంది. వెంటనే ఈ మార్గంలో మరమ్మతులు చేపట్టాలి.

–శిర్ల గోవింద్, వ్యాన్ డ్రైవర్, శిర్లపాలెం

వేడుకగా 'నమామి సాయి శతరుద్రీయం'

శాస్త్రోక్తంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు



మంత్రాలు పఠిస్తున్న అర్చక బృందం

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా చిట్టివలస సత్యసాయి సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణమండపంలో 'నమామి సాయి శత రుద్రీయం' పేరుతో 95వ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ఓంకార సుప్రభాత సహిత నగర సంకీర్తన, శోభాయాత్ర, పతాకావిష్కరణ, గోపూజ, మొక్కులు నాటే కార్యక్రమాలు పూర్తి చేశారు. వేలాది మంది భక్తులు, పదుల సంఖ్యలో వేదపండితుల సమక్షంలో రాష్ట్ర అర్చక ప్రతినిధి హరిప్రసాద్ పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు పి.ఆర్.ఎస్.నాయుడు, జె.సూర్యనారాయణ, ఆర్.ఎ.నాయుడు, ప్రముఖ వ్యాపారవేత్త రంగూరి సీతారామదొర, సమితి ప్రతినిధులు గొట్టుపల్లి సత్యనారాయణ, టి.వి.ఆర్.బాబా, మానాపురం సాయికుమార్, పి.రవిప్రసాద్, సిహెచ్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం

కొమ్మాది: బీచ్ రోడ్డు రుషికొండలోని ఓ రిసార్ట్‌లో ఆదివారం ఆలిండియా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ ఆర్‌ఎం కపర్దే, జనరల్ సెక్రెటరీ మనోజ్ గోయల్ హాజరై, బ్యాంకుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఉద్యోగుల విషయంలో జరుగుతున్న అసమానతలపై చర్చించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆంధ్ర ప్రెసిడెంట్ విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ జేకే తదితరులు పాల్గొన్నారు

మహా గణపతిం మనసాస్మరామి

విఘ్నాలకు అధిపతి మహా గణపతిని మనసారా అర్చించారు నియోజకవర్గవాసులు. శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. వాడవాడలా కొలువుదీరిన గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 6వ వార్డు రేవళ్లపాలెం శ్రీ సాయిసూర్య రెసిడెన్సీ వద్ద ఏర్పాటుచేసిన మండపంలో గణపతి హోమం నిర్వహించారు. పలు మండపాల వద్ద దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

–తగరపువలస/మధురవాడ



సంతపేట రెడ్డి వీధి మండపం వద్ద దీపాలంకరణ



రేవళ్లపాలెంలో పూజలందుకుంటున్న గణనాథుడు



వేములవలసలో కొలువుదీరిన గౌరీనందనుడు



ఆనందపురం మండలం పొడుగుపాలెంలో..



ఆనందపురం మండలం మెట్టమీదపాలెంలో..



మజ్జివలస రామాలయం మండపం వద్ద ..

నవోదయ దరఖాస్తు గడువు పెంచాలి

మధురవాడ: నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. గడువు ఈ నెల 16వ తేదీతో ముగుస్తుందని, అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నందున గడువు పెంచాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రికి, నవోదయ ఉన్నతాధికారులు లేఖలు రాసినట్లు ప్రకటనలో తెలియజేశారు.

ఇంద్రకీలాద్రిపై మాజీ మంత్రి ముత్తంశెట్టి



మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు ఆశీర్వాదాన్ని, ప్రసాదాలను అందించారు. –తగరపువలస


'తీయని గతం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ఉపాధ్యాయుడు, రచయిత పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ రచించిన 'తీయని గతం' పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ పుస్తకాన్ని డైట్ విశ్రాంత అధ్యాపకుడు మంథా సుబ్బారావు ఆవిష్కరించారు, కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు, విశ్రాంత డీఈవో ఎ.సాయిబాబా, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు పాల్గొన్నారు.


వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



ప్రతాపరెడ్డి

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదయింది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. కొమ్మాది 100 అడుగుల రోడ్డులో డి.వెంకటప్రతాప్ భార్య సరళతో నివసిస్తున్నాడు. గత నెల 30వ తేదీన భార్యాభర్తలు గొడవ పడటంతో, ప్రతాప్ ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. ఫోన్ స్విచ్ ఆపేశాడు. అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో ప్రతాప్ భార్య పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యాలయానికి పూర్వ విద్యార్థినుల వితరణ



విద్యాలయానికి ఇన్వర్టర్లు, కంప్యూటర్, ప్రింటర్ అందిస్తున్న పూర్వ విద్యార్థినులు

భీమునిపట్నం: తాము చదువుకున్న విద్యాలయానికి సహకారం అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. భీమిలిలోని ఏపీ బాలికల గురుకుల విద్యాలయంలో 1983 నుంచి 2016 వరకు విద్యాసంవత్సరాల్లో పదో తరగతి చదువుకున్న వివిధ బ్యాచ్‌ల విద్యార్థినులు విద్యాలయానికి రూ. లక్ష విలువ చేసే నాలుగు ఇన్వర్టర్లు, కంప్యూటర్, ప్రింటర్‌ను అందించారు. తమకు విద్య నేర్పిన గురువులను సత్కరించారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులంతా సాయంత్రం వరకు ఆనందంగా గడిపి, మధుర స్మృతులతో తిరుగు పయనమయ్యారు. నిర్వాహకులు మాధవి, సంధ్యారాణి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

పీఎం పాలెం: శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. సింహాచలం సరస్వతి నృత్య కళా మందిర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

నీరు లేక నిత్యం అవస్థలు

- పీహెచ్‌సీలో మూడు నెలల క్రితం పాడైన బోరు
- రోగుల పరిస్థితి దయనీయం



నీటి సమస్య తీవ్రంగా ఉన్న మధురవాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మధురవాడ: మధురవాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుర్వేద ఆస్పత్రులను నీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మూడు నెలలుగా ఇక్కడి బోరు బావి పాడవడంతో సిబ్బంది, రోగులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఆయుష్ విభాగానికి చెందిన ఆయుర్వేద వైద్యశాల ఉన్నాయి. ఈ రెండు ఆస్పత్రుల్లో ముగ్గురు వైద్యులు, 20 మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఈ ఆస్పత్రుల్లో ఓపీ రోజుకు 200 వరకు ఉంటుంది. రాత్రి పూట కూడా పీహెచ్‌సీ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఇక్కడ ప్రసూతి సేవలు కూడా అందిస్తుండటంతో రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. అయితే, ఈ రెండు ఆస్పత్రుల్లోనూ నీరు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మహిళలకు 'మరుగు' సమస్య

మరుగుదొడ్లలో నీరు లేక నిత్యం మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఇక రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది పరిస్థితి మరింత దయనీయం. జీవీఎంసీ వాటర్ ట్యాంకర్ ద్వారా అప్పుడప్పుడు నీరు అందిస్తున్నా ఆస్పత్రిలో నీటి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చలేకపోతోంది. కొన్ని సందర్భాల్లో బయట వ్యక్తులకు డబ్బులిచ్చి నీరు తెప్పించుకుంటున్న పరిస్థితి. అధికారులు స్పందించి వెంటనే బోరు బాగు చేయించి, నీటి సమస్యను తీర్చాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

తక్షణం చర్యలు తీసుకుంటాం: డీఎంహెచ్‌వో

ఈ విషయమై డీఎంఅండ్ హెచ్‌వో పి.జగదీశ్వరరావును వివరణ కోరగా ఈ సమస్యపై ఇప్పటికే జీవీఎంసీ అధికారులతో మాట్లాడామన్నారు. బోరు వేయించేందుకు తక్షణ చర్యలు చేపడతామన్నారు.

వాచ్‌మన్ అనుమానాస్పద మృతి



మృతుడు అప్పలరాజు

కొమ్మాది: ఎండాడలో రోడ్డుపై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఎండాడ దరి వివేకానందనగర్‌లోని సాయి తేజ అపార్టుమెంట్స్‌లో పాట్నూరు అప్పలరాజు (35) వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై సమీపంలో ఉన్న పెట్రోల్ కోసం బంక్‌కు వెళ్లిన అప్పలరాజు, కొద్దిసేపటి తర్వాత బంక్ వెనుక గల స్క్రాప్ దుకాణం వద్ద విగతజీవిగా కనిపించాడు. అప్పలరాజు పడి ఉండటాన్ని వాకర్స్ గుర్తించి ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి, అప్పటికే అప్పలరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పలరాజు గుండె సంబంధిత సమస్యతో చనిపోయాడా, లేక ఎవరైనా దాడి చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 8 సంవత్సరాల క్రితం బతుకుతెరువు కోసం అనకాపల్లి జిల్లా తిరువూరు గ్రామం నుంచి ఇక్కడికి అప్పలరాజు వలస వచ్చాడు. మృతుడికి భార్య , 8 ఏళ్ల కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

బట్టీ విద్యకు స్వస్తి చెప్పాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

మధురవాడ: పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే క్రమశిక్షణ తప్పనిసరి అని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్ అన్నారు. బట్టీ విద్యకు స్వస్తి చెప్పి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని, ఆ రకమైన విద్యాబోధన అన్ని చోట్ల జరగాలని సూచించారు. రేవళ్లపాలెంలోని శ్రీనివాస స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన స్పెషల్ మోటివేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. భవిష్యత్ సవాళ్లు, అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవిశ్రాంత పోరాట యోధుడు ఏచూరి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మధురవాడ: ప్రజల కోసం, ప్రజా ఉద్యమాల కోసం అవిశ్రాంత పోరాటం చేసిన గొప్ప కమ్యూనిస్ట్ యోధుడు సీతారామ్ ఏచూరి అని సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి. అప్పలరాజు అన్నారు. కొమ్మాది కే–2 కాలనీలో నిర్వహించిన సంతాప సభలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో చిన్నారులకు పతకాలు



మెడల్స్ సాధించిన ఆనందపురం చిన్నారులు

తగరపువలస: నగరంలోని తాటిచెట్లపాలెంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో ఆనందపురానికి చెందిన విద్యార్థులకు పతకాలు లభించాయి. కుప్ప రేవంత్‌కు కాటా విభాగంలో గోల్డ్, కుమట విభాగంలో బ్రాంజ్ మెడల్ లభించాయి. అలాగే వివిధ విభాగాల్లో ముడసల సిద్ధూ గోల్డ్, సిల్వర్ మెడల్స్, దేవీశ్రీ ప్రసాద్ సిల్వర్, నిఖిలేష్ గోల్డ్, బ్రాంజ్, పుట్టా మితేష్ సిల్వర్, బ్రాంజ్, జాన్వి గోల్డ్, కుప్ప మనోజ్‌కుమార్ సిల్వర్, షిణగం వికాస్ సిల్వర్, షిణగం సంజయ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా విజేతలను కోచ్ ముగడ వెంకటరమణ, జైజవాన్ ఫౌండేషన్ ప్రతినిధి కుప్ప రాజశేఖర్ అభినందించారు.

వాడవాడలా అన్న సమారాధనలు



సంగివలసలో అన్నదానం చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు



గాయత్రీ నగర్‌లో..

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలుచోట్ల భారీ అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. సంగివలసలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో అక్కరమాని కొండబాబు, దివాకర్, పీతల వెంకట అప్పారావు, నమ్మి బంగారుబాబు, సారిపల్లి మోహనరావు, నమ్మి ప్రవీణ్, శ్రీను, గోవింద్, మన్యాల పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

- సంతపేట రెడ్డివీధిలో గణేష్ థియేటర్ ఎదురుగా, రజక సంతపేటలోనూ అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.
- 5వ వార్డు కార్పెంటర్స్ కాలనీలో రైజింగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో కళింగ సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు, ఎండీ షరీఫ్ సహకారంతో అన్నదానం చేశారు.

గాయత్రీనగర్‌లో..

పీఎం పాలెం: స్థానిక గాయత్రీనగర్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మందికి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పోతిన ప్రసాద్, జామి శివకుమార్, మూర్తి బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల ఓవరాల్ చాంపియన్ విశాఖ



విశాఖ జట్టుకు కప్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం: స్థానిక సన్‌స్కూల్‌లో ఆదివారం సాయంత్రం ముగిసిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలవడంతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. రాష్ట్ర యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16 విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ఇందులో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలవడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. అలాగే ఉమ్మడి కృష్ణా జిల్లా ద్వితీయ, కర్నూల్ జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్టుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షులు వర్మ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి పాల్గొన్నారు.